# ఆత్మీయతకు మరో పేరు శ్రీ కిడాంబి రఘునాథ్

– దివాకర్ పేరి, Dayton, NJ

శ్రీ రఘునాథ్ గారి పేరు తలచుకోగానే ఎవరికయినా గుర్తు వచ్చేది వారి ఆప్యాయత, ఆదరణ. కొత్తవాళ్ళని కూడా చిరకాల స్నేహి తుల్లా పలకరించి ఆదరించేవారు. ఇతను "మన" దివాకర్ అనో, వీరు "మన" చిత్తరంజన్ గారు అనో పరిచయం చెయ్యడం ఆయన "మన"స్సు లో మనపై వుండే స్నేహభావం వ్యక్తమయ్యేది. నాకు ఆయనతో దశాబ్దం పైగా పరిచయం వుంది. శ్రీ రఘునాథ్ గారితో పరిచయం, ఆయనతో తెలుగు జ్యోతికి పనిచెయ్యడం నా అదృష్టం గా, నాకు దక్కిన వరంగా భావిస్తాను. శ్రీ రఘునాథ్ గారిలో వుండే ప్రత్యేకత ఏమిటంటే మనం ఆయనకి పరిచయమైతే ఆయనకి పరిచయం వున్న వాళ్ళందర్నీ మనకి పరిచయం చేసేవారు. దానితో మనందరం ఒక స్నేహమాలికలా అయిపోతాం. రూపెత్తిన స్నేహం ఆ మహామనిషి. ఈనాడు ఆయన మన మధ్య లేకపోవటం మన దురదృష్టం.

"అయోగ్య పురుషోనాస్తి, యోజక స్తత్రదుర్లభః" అన్నట్లు అటువంటి అపురూపమయిన యోజకులు శ్రీ రఘునాథ్. వీడెందుకూ పనికిరాడని ఎవ్వర్నీ నిర్లక్ష్యం చెయ్యడం వారి ప్రవృత్తి కాదు. అందర్నీ కలుపుకుని ఎవరు ఎలాంటి పనికి యోగ్యులో నిర్ణయించి, వారిని ఆ పనిమీద నియమించడంలో రఘునాథ్ గారు సిద్ధహస్తులు. తొంభయ్యవ దశకం మొదట్లో శ్రీ పరంజ్యోతి, నిర్మలగారు, కృష్ణ గారు, శ్రీ భావరాజు గారు వంటి మిత్రుల్ని కూడగట్టి పసందయిన వంటలు వండి వడ్డించి మరీ తెలుగు పండగల్ని జరిపించడం నాకు గుర్తు. అప్పుడు తెలుగు సారస్వత సంఘం వేడుకలు సరదాగానే కాకుండా "సరసం" గా కూడా వుండేవి.

"యోగః కర్మసు కౌశలం" అంటుంది శ్రీమద్భగవద్గీత. శ్రీ రఘునాథ్ కార్య నిర్వహణ సామర్థ్యం గల కర్మ యోగి. ప్రవాసాంధ్రుడు, విదేశాంధ్రుడై ఆంధ్రత్వానికే వన్నె తేవాలనేది ఆయన ధ్యేయం. ఆయన సంపాదకత్వంలో వచ్చిన "సురభి"– తెలుగుపలుకు 13వ సంచికకోసం ఆయన పడ్డ శ్రమ మాటలకందనిది. ఇక్కడ స్థిర పడ్డ తెలుగు రచయితల రచనలు వాళ్ళని అడిగి తెప్పించి ప్రచురించారు. "అమెరికాలో వున్నా మనవాళ్ళు తెలుగు మర్చిపోలేదని – స్వదేశాంధ్రు లకి దీటుగా తెలుగులో రచనలు చేయగలరని" అందరికీ తెలియా లని ఆయన తపన. ఎక్కడ తెలుగు వాళ్ళు పత్రిక పెట్టుకుంటామన్నా , సంఘం పెట్టుకుంటామన్నా ఆయన వాళ్ళకి కావలసిన సహాయం చేసి, ఆ సంఘాలు–పత్రికలు వృద్ధిలోకి వస్తూంటే చూసి ఆనందించేవారు. పరోపకారం విషయంలో ఆయన ముందుండే వారు. ఎవరయి నా వచ్చి ఎదయినా సమస్య చెపితే – అది ఎల్లా పరిష్కరించాలనేదే కాకుండా ఎవరిని కలిస్తే పని అవుతుందో కూడా చెప్పేవారు. అల్లాగే ఎవరయినా ఎదయినా పనిమీద వెళితేనో, లేక ఫలాని వాళ్ళని కలవా లంటేనో ఈపని మనవల్ల అవుతుందా, ఆయన ఎవరో మన మాట వింటాడా అని శషభిషలకి పోకుండా "ఏమిటయితే, బయలు దేరదామా" అని అన్నింటికీ ఉత్సాహంగా ముందుండేవారు.

తెలుగు జ్యోతి రఘునాథ్ గారి మానస పుత్రిక. ఆయన జీవితంలో అన్నింటి కన్నా మిన్నగా తెలుగు జ్యోతిని అభిమానించేవారు. జ్యోతి ఎవరు చదువుతున్నారు, వాళ్ళ అభిప్రాయమేంటి అని ఆయన తరచు వాకబు చెయ్యడం జరిగేది. ఎవరయినా జ్యోతి తీరుతెన్నులు మార్చాలని ప్రయత్నించినా ఆ–యనకి విపరీతమయిన కోపం వచ్చేది. ఒకసారి "ఎందుకు రఘునాథ్ గారూ, వీళ్ళందరితో అనవసరమయిన స్పర్థలు. చిన్న చిన్న మార్పులు చెయ్యరాదా? వాళ్ళకికూడా తృప్తిగా వుంటుంది." అన్నా. దానికి అయన నవ్వేసి, "జ్యోతికి ఏం తక్కువ యిందని మార్పులు చెయ్యాలి." అని ఆంధ్ర సచిత్ర వారపత్రిక వుదా హరణ ఇచ్చారు. – ఆ గొప్ప పత్రిక ఇతర పత్రికలతో సర్క్యులేషన్ కోసం పడ్డ పోటీ తద్వారా దాని సాహిత్యపు విలువల్లో వచ్చిన మార్పులు, తదనంతర స్థితి తెలిసిన వాళ్ళకి ఇంక ఏమీ చెప్పక్కరలేదు. అందరూ మెచ్చిన "జ్యోతి"కి మార్పులనవసరమని చదువరులు మెచ్చే సాహిత్యమే తప్ప తళుకు–బెళుకులవసరం లేదని ఆయన అభిప్రా యపడేవారు. జ్యోతిలో ప్రచురించే నలభయి పేజీల్లో ప్రకటనలు వగైరా పోగా, ఎంతవీలయితే అంత ఎక్కువగా సాహిత్యం ఇవ్వాలి అని తాపత్రయపడే వారు. రెండు లైన్‌లు ఖాళీ వదలడం ఇష్టం లేక పేజీ లేఅవుట్ మార్చిన సందర్భాలు అనేకం. అలాగే అమెరికాలో నివసిస్తున్న వారి రచనలు ప్రచురించాలని రఘునాథ్ గారు ఎన్నో ప్రయత్నాలు చేసేవారు. ఒకసారి ఒక రచయిత్రి పంపిన రచనలో తెలుగు కన్న ఇంగ్లీషు ఎక్కువగా వుందని ఆ కారణంతో తిప్పి పంపించమటే "అసలు ఇక్కడ వాళ్ళు రాయటమే తక్కువ. నువ్వు దీన్ని తెలుగులో తిరగరాయ" మని పురమయించారు.

తెలుగు వాళ్ళు కలిసినప్పుడు తెలుగు మాట్లాడుకోవటం, తెలుగు వాళ్ళ పిల్లలకి తెలుగు నేర్పించడంలాంటి విషయాలమీద ఆయనకి మక్కువ ఎక్కువ. అయన అందర్నీ ఈ విషయాల్లో ప్రోత్సహించడమే కాకుండా ఆయన కూడా వారి కుమార్తె చి.ఉషకి చక్కని తెలుగు నేర్పించారు. నేనొక సారి "రఘునాథ్‌గారూ, మా పిల్లవాడు తెలుగు మాటలాడేటట్లు చేయటం ఎలా?" అని అడిగితే, "వాడు ఇంగ్లీషులో మాట్లాడినప్పుడు మీరిద్దరూ సమాధానం చెప్పకుండా మౌనం వహించండి" అని చెప్పారు. చిట్కా చక్కగా

పనిచేసింది. తెలుగు సారస్వత సంఘ సమావేశాల్లో కూడా పూర్తిగా తెలుగు లోనే సభ్యులు ప్రసంగించేలా అందర్నీ ప్రోత్సహించేవారు.

మనందరికీ అత్మీయుడు, మార్గదర్శి అయిన శ్రీ రఘునాథ్ గారు చిన్నవయస్సులోనే అకాల మృత్యు వాతపడ్డం వారి కుటుంబ సభ్యులకీ, తెలుగు సారస్వత సంఘానికీ, తెలుగు జ్యోతికే కాకుండా యావత్ అమెరికాంధ్రులకే తీరని లోటు. ఆయన జీవితం లోనే కాకుండా అశయాల్లో, అచరణలో కూడా అర్ధాంగి అయిన శ్రీమతి ప్రభగారికి, వారి కుమార్తె ఉషకు నా ప్రగాఢ సానుభూతి తెలుపు తున్నాను. ఆయన లేని లోటు తీర్చలేనిది. ఆయన - ఆదర్శాలు ఆశయాలు విస్మరించరానివి.

వారి పార్థివ దేహం చ్యుతమయినా వారి ఆశయాలు, ఆదర్శాలూ "జ్యోతి" రూపంలో మన మధ్యనే వుంటాయి. శ్రీ రఘు నాథ్ గారికి అత్యంత ప్రీతిపాత్రమయిన "జ్యోతి" ఎల్లవేళలా ప్రకాశించి ప్రవృద్ధ మయేలా చూడటమే మనం ఆ మహా మనిషికి అర్పించే శ్రద్ధాంజలి.

"నాస్తి తేషాం యశః కాయో జరామరణజం భయం."